నాకు నచ్చిన కథ

కలుపు మొక్కలు

-శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

''చి-త్తం చి-త్తం. ఒక్క కలం పోటుతో తమరొక బ్రాహ్మణ కుటుంబానికి యావజ్జీవమూ అన్నం పెట్టించగలరు''

''అన్నం పెట్టినా సున్నం పెట్టినా జిల్లా బోర్డు ప్రెసిడెంటు గాని, నావల్ల ఏమవుతుంది?''

''పేరుమట్టుకి వారిదే. అంటే, మనవి చేసుకుంటాను. ఒక సత్రం వుందంటే అది ప్రతిష్ఠించిన దాత వేరు, కని పెట్టుకుని వుండి అక్కడ సర్దుబాట్లు చేసే గుమాస్తా వేరూనూ. అయితే, ఆ దాత ఆజ్ఞ శిరసావహించడమే ఆ గుమాస్తా నిధి కూడా మహాప్రభూ!''

''నేను దాతను కానే? ప్రెసిడెంటు అంటే గుమస్తా కూడా కాడే?''

''తమరలా సెలవిప్పిస్తే నేనేం మనవి చేసుకోగలనూ? సబ్ కలెక్టరు దొరవారి శిఫారసు తోసేసి ఏ ప్రెసిడెంటు బతగ్గలడూ?''

''నిజమే కాని అది పూర్వకాలం మాట. ఇప్పుడలాంటి పద్ధతులేవీ సాగవు. వెనకటిరోజుల్లో యే ముస్సద్దీప్లీడరో జిల్లా బోర్డు ప్రెసిడెంటు అయేవాడు. అధికార్ల దగ్గిర ఎంత భయభక్తులతో మసులుకోవాలో వాళ్ళకి బాగా తెలిసి వుండేది. ఇప్పటివాళ్లు - చాలామంది మాట సుమా - స్కూల్ ఫైనల్ కూడా కానక్కర్లేదు. ఓటు - ఇప్పుడంతా వోటుతో వుంది మహిమ. ఆ పైని గుజరాతీ కోమట్లకి మంగళపద్రమైన పచ్చపెట్టి, ఇక చెప్పడానికేం వుందీ? పెద్ద సంతకమా చిన్న సంతకమా అని డఫేదారు నడిగిగాని-''

''తమరే ఉపక్రమించారు కనక విన్నవించుకుంటాను. మన ప్రెసిడెంటు గారు - చిత్తగించారూ? తక్కిన అవగుణాలు అలా వుండగానున్ను - రాత్రీ పగలూ కూడా - కేవలమూ వేశ్యావాటికలో-''

''సాటి బ్రాహ్మణ్ణి పట్టుకుని అలా అంటావేమిటయ్యా?''

''సాటి వాడు కనకనే మాకీ తిప్పలు. బ్రాహ్మడు కనకనే మాఘస్నానాలూ దొమ్మరిగుడిసెలూనూ. అలాకాక, ఏ రెడ్డిగారో, ఏ నాయుడుగారో, ఏ చౌదరి గారో అయితే-

''వా! బ్రాహ్మణయుక్తి అంతా కురిపించేస్తున్నావే?''

''ఇందులో కడుపు మాడిన దుఃఖమే గాని యుక్తేం వుంది మహాప్రభూ?''

''అయితే సంగతంతా తెలిసేవుంది కదా, ఏ నాయకురాలినో పట్టుకోరాదుటయ్యా?''

''తమవల్ల కాకపోతే గదా?''

''అయినా సులభంగా పని జరిగే మార్గాలున్నప్పుడీ అవస్థలన్నీ ఎందుకూ?''

''బోగందాన్నో, కులటనో ఆశ్రయించడం కంటే అవస్థ ఏం వుందీ? కాక; ఇంటిల్లిపాదిమీ నొక నెలదినాలు పస్తుండి అయినా-''

''అలా దారికిరావయ్యా! జిల్లా బోర్డు ప్రెసిడెంటు కయితే సప్లయిలు మహాబాగే చేస్తారు నీ వంటి వాళ్ళు''.

''చిత్తం చిత్తం. నాది పొరబాటే. ''రిక్తహస్తేన నోపేయా' త్తని కారిక కూడా వుంది. చిత్తగించారూ? కనక రేపీపాటికి-''

''ఏదో మాటవరసకంటే ఇలా మొదలు పెట్టావేమిటయ్యోయ్? కాస్త శిఫారసు భాగ్యానికి నేను లంచం పుచ్చుకుంటానుటయ్యా?''

''లంచమా? ఎంతమాటా? ధర్మరాజు వంటి తమ సన్నిధిలో అలాంటి మాట అనడాని కెన్నివేల గుండెలుండాలీ? పోని అంటే తమవంటి వారికి లంచమివ్వడానికి నాకు మాత్రం తాహతు ఎక్కడిదీ?... ఇంతకి, మాకం దరికీ ఆధారం చూపించబోతున్నందుకు తమకొక్క మణుగు నెయ్యి. ఏ పులుసులో కయినా పనికివస్తుంది వొక బుట్టెడు బెల్లం. ఏ రొట్టి ముక్కలో కయినా వాడుకోడానికొక డబ్బా తేనె పానకం-''

''ఇవీ, ఇంకా ఇలాంటివి నాకు సప్లయి చేస్తానంటావా ఏమిటి? దిట్టమైన వాడవేనే?''

''తమ రాగ్రహించారని ధూర్యం కలగబట్టి-''

''వెర్రి బ్రాహ్మడవు నీ మీద ఆగ్రహం ఏమిటి కానీ - రెండు రోజుల్లో మా పెద్దమ్మాయీ అల్లుడూ పిల్లలూ వస్తున్నారు, నేనే కొంటాను గానీ-''

''వద్దు మహాప్రభూ, వద్దు. తెల్లవారాటప్పటికి నేను దాఖలు చేసు కుంటాను. నేను ఆడపిల్లలు గలవాణ్ణి. ఆడపిల్లలికి పుట్టింటి ఆశ ఎంత వుంటుందో, తల్లిదండ్రులు వాళ్ళ నెలా సంతోష పెట్టాలో నాకూ కొంచెం తెలుసు. పైగా నా కొడుక్కి తమరన్నం పెట్టించారప్పుడు, నేను, తమ అమ్మాయిగారికి కాస్త వుపమా, కాస్త కాఫీ-''



''అవునవును, బెల్లం మాటకేం గాని - వెధవ బెల్లం మా ఇంటో యీగలు కూడా దానిమీద వాలవు గాని - నువ్వు కాఫీ అంటే జ్ఞాపకం వచ్చింది, నీ దగ్గిర ఈ మధ్యనే యీనిన ఆవుందిట కాదూ?''

''ఉంది మహారాజా, వుంది నాకు జ్ఞాపకం వచ్చింది కాదు. ఇంకెందుకూ? తెల్లవారేటప్పటికి స్వయంగా తోలుకు వస్తాను నేను''.

''గోదానం చేసుకున్నట్టనుకుంటావు కామోసునేం''.

''రామరామా! దానం పట్టేదాకా తమకేం?''

''బ్రాహ్మలకిస్తే ఏ పేరు పెట్టినా దానమే అవుతుంది గాని; మాకిచ్చింది - విన్నావూ? సప్లయి... ఇనాము... నజ రానా... నేమాను''.

''చిత్తమండి''

''అసలు, వొకళ్ళకివ్వడానికేగాని, మేము పుచ్చుకోడాని కధికారం లేకుండా చేశారు కాదూ మీ బ్రాహ్మలు?''

''అనకూడదు కానండీ - పూర్వపువాళ్ళు ముక్కు మూసుక్కూచోడం తప్ప మరేమీ యెరగరండి''.

''ముక్కు మూసుక్కూచోలేదు మీ బ్రాహ్మలు, ముక్కు దాళ్లు పోసి జాతినంతనూ నిర్వీర్యం చేసేశారు''.

''అంటే-''

''అంటేనా? మనిషినీ మనిషినీ విడదీసి, దూరం చేసి, అసూయ పెంచి - అదంతా పెద్దగొడవ, దానికేం గాని - తెల్లవారితే ద్వారపూడి సంతకి జవాన్లని పంపుదామను కుంటున్నాను మానెయ్యమంటావా?''

''ఇంకెందుకూ మహాప్రభూ?''



''నిజమే కదా?''

''ఇంకా - సందేహం - గాయత్రీ సాక్షి!''

''మాకు లేని జంధ్యాలంటే మాకేం నమ్మకం గాని - మా అమ్మాయి గారిక్కడ ఉన్నంతకాలమే - కాదంటే వొంటిపూట పడేదాకానూ. తరువాత మీ ఆవు మాకక్క ర్లేదూ సుమా?''

''ఏదో శాస్త్రం చెప్పిన తరవాయిగా - వొట్టిపోయాక కూడా గుదిబండ లాగ - తరువాత నేను వచ్చి తోలుకు పోతాను కాదూ అన్నదాతా!''

''సరే అయితేను. నువ్వు మాకు ఆవుని తోలిపెడితే ఈ కారణం వల్ల కూడా అది గోదానంలో చేరదు సుమా!''

''అసలు, తమకి సందేహం-''

''సందేహానికేమీ లేదు గానీ - అసలు సందేహం అంటే ఏమిటి గానీ - ఇంకోటి కూడా వుంది, గుర్తించావో లేదో?''

''ఏమిటండీ?''

''అప్పటికీ అది దానమే అంటే, మళ్ళీ నువ్వు తోలుకు పోవడం దత్తాపహారం అయిపోతుంది. నీకు ఆ పాపం చుట్టబెట్టకుండా వుండడాని క్కూడా అది దానంలో చేర్చ డానికి వల్లకాదు. తెలిసిందా?''

''అవునండి''

''సరే వెళ్ళండి. రేపు పొద్దున్న కనపడతారు కాదూ అవ ధానులు గారూ?''

''పొద్దున్న దాకానా, కాకులు కూశాటప్పుడు వచ్చి తమర్ని లేపనూ?''

''అదీ తెలివంటే. ఏమంటే? వెలుగువచ్చాక అయితే దిక్కుమాలిన ప్రజలు''

''పోనీ వొక పనిచేస్తే?''

''ఏమిటదీ?''

''రాత్రి పన్నెండయాటప్పటికి-''

''భేష్! చాలా బాగుంది. మేము సినీమాకి వెళ్ళి వచ్చే టప్పటికి తోలుకు వస్తావన్నమాట!''

''చిత్తం''

''అలా చెయ్యి. నే నీరాత్రే ప్రెసిడెంటుకి ఘాటయిన ఉత్తరం. రాసి వుంచుతాను; పట్టుకు వెడుదువుగాని''

''అలాగే మహాప్రభూ!''

''మరి వెళ్ళు''

''అన్నదాతా సుఖీభవ...''

****

''మణుగునెయ్యే?''

''మరి తప్పదు''

''ఒప్పుకునే వచ్చారా ఏమిటి?''

''లేకపోతే చావనా?''

''ఇన్నాళ్ళనుంచి కాపరం చేస్తున్నాను, ఇంతమందిని కన్నాను గాని, పండుగ రోజున అయినా మిల్లిగరిటె డుకంటే ఎరగం-''

''ఈ ఉద్యోగాలు లేన ప్పుడు ఆ నిర్భాగ్యుడు మాత్రం ఎరుగునా? వాడి రోజీది''

''ఇంకేమీ లేదుకదా?''

''అ-వు-కూ-డా''

''ఏమిటీ?''

''ఇంటో కూచుని అలా రంకెవెయ్యడం కాదు ప్రజ్ఞ. మన ఆవుని కూడా తోలి పెట్టాలి''.

''కొంపముంచారు''

''ఎలాగో సమాధానం చెప్పుకోవాలి. లేక పోతే వుద్యోగం అంటే మాటలతో వుందా?''

''.......... .... ''

''ఇంతకీ; అబ్బాయికది అత్తవారిచ్చిందే కాదూ?''

''మీ కేమయినా మంచీ చెడ్డా తెలవాలా అక్కర్లేదా?''

''తెలవక ఏం తక్కువయిందీ యిప్పుడూ?''

''మనమరాలికి పాలకోసం కదా వియ్యాలవారు దాన్ని తోలిపెట్టారు?''

''దాని తండ్రికి ఉద్యోగం కోసం మనం తోలిపెట్టాలి''

''నలుగురూ గడ్డిపెట్టరూ?''

''నలుగురూ పెట్టే గడ్డెక్కువా, ఆయన పెట్టే అన్నం ఎక్కువా?''

''.... నాకేం? కోడలి ఇష్టమూ, అబ్బాయి మనస్సూ, ఆ పైని మీ అవసరమూనూ. మీ యిష్టం వచ్చినట్టు చేసు కోండి''

''అబ్బాయే తోలుకు వెడతాడు, నా యిష్టం ఏమిటి మధ్యన?''

''చంటిపిల్ల నోటి దగ్గిర పాలు పడగొట్టి - పిల్లలున్నారా ఆ కలకటేరుకి?''

''రెండు రోజుల్లో పెద్దకూతురూ, అల్లుడూ, మనమలూ వస్తున్నారు - వాళ్ళకి కాఫీ-''

''కూతుళ్ళ తండ్రేనా? నోరెలా వచ్చిందో?''

''అధికారం - అధికారం - అది గలవాళ్ళ నోటి కిక అడ్డే మిటి?''

''చంటిపిల్ల - మూడు మాసాల గుడ్డు - దాని వుసురు తగలదూ ఆ యముడికీ?''

''మాట్లాడవద్దు. గప్‌చిప్! నిప్పున్నకఱ్ఱ తగులడక మానదు. ఇప్పుడు దీపాలు పెట్టాటప్పటికీ 'మాధవ కవళం' అంటూ వచ్చే వాళ్ళంతా పూర్వ జన్మలో ఎవరో ఎరుగుదువా? ఈ బాపతే. ఇక వూరుకో. ఫించను పుచ్చు కున్నాక ఇక వీళ్ళ మొగం చూసేవారెవరు?''

''ఆనక ఆయన గతి ఏమిటో కాని యిప్పుడు పిల్ల కడుపు మాడుతుంది. ఇక డబ్బా పాలు పొయ్యాలి''.

''ఒక్క - నెల - ఒక్కనెల వోపికపట్టు. ఆ పూచీ అంతా అబ్బాయిదే కాని - అయినా కష్టసుఖాలు నువ్వు కూడా కోడలికి బాగా బోధించు. నెల తిరిగేటప్పటికి యాభై రూపాయలు గళ్ళున చేతిలో పడతాయి. మొదటి నెల జీతం పెట్టి మాంచి కామధేనువుని కొనేస్తాను. అప్పుడింటి ల్లిపాదికీ పెరుగే, రెండో నెల జీతం పెట్టి వొక్క బనారసు చీర - చూశావు? కోడలు పొ-చ్చని మనిషి కనక వుదారం గుది. జరీ పువ్వులది కొని కట్టబెట్టామంటే దాని మొగం యింతవుతుంది. మూడో నెల జీతంలో బుల్లెమ్మకి బాల తొడుగు. దాంతో దాని కడుపుకొట్టిన దోషం పోతుంది. తరువాత సంసారం పూటుగా-''

''అఘోరించినట్టే వుంది మీ కల్పన. చాల్లెండి. నేర్చుకు పోయారిక వూరుకోండి. ఇదో గొప్పగా చెప్పుకోకండి. నలు గురూ తాటాకులు కడతారు''.

''వాళ్ళ మొఘం. అబ్బాయికి ఉద్యోగం అయాక నేనిక ఆ వాజమ్మలతో మాట్లాడుతానూ?''

****

''తమరలా అంటే-''

''నేనన్న దేం వుందీ యిందులోను? ఉన్న సంగతి చెప్పాను. ఆ పైని మీ యిష్టం''.

''అలా కాదు. తమరు కోప్పడితే నేనాగలేను. నేను బ్రాహ్మణ్ణి. బీదవాణి. కుటుంబీకుణ్ణి. నేను చెప్పుకోవడం కాదు గాని, ఘనాపాఠీని. తమరు కాస్త అనుగ్రహించాలి''.

''ఇప్పుడనుగ్రహానికేం తక్కువ వచ్చిందీ? వారు ఇంటికి రాగానే దర్శనం చేయిస్తాను. మీరు సావకాశంగా చెప్పుకో డానికి కావలసినంత అవకాశం కలిగిస్తారు. ఏం?''

''తమరు నాలుక చివరనుంచి మాట్లాడితే-''

''మరి నువ్వు?''

''.. ... ...''

''నువ్వు చేస్తూవున్న దేమిటయ్యా?''

''... .. ..''

''వంగతోట దగ్గిర బావ కాదేం?''

''... కటాక్షించండి''

''ఏమిటిది?.... వోస్''

''స్వీకరించండి''

''లింగూ - లింగూ అయిదురూపాయల కాగితం చేతిలో పెట్టి పే-ద్ద మేరు పర్వతం లాక్కుపోదామనా,

వేషగాడవే''.

''మహారాజులు కాదూ? ఇవి చేతులు కావు. కాళ్ళు. రుద్రాక్షతావళం తాకట్టు పెట్టి తెచ్చానీ అయిదు రూపాయలూను. ఇక నన్ను కోసినా తేలేను, రక్షించండి''.

''... అలా అన్నావా? సరే అయితే. అత్యాశ మీ బ్రాహ్మలికి చెల్లింది. కాని మాకు కాదు, ఇక రేపు – ఇవ్వాళ్టికి మించి పోయింది. తెలిసిందా? ఉదయం ఎనిమి దిన్నరకి వస్తే, కాఫీ పుచ్చుకునేటప్పుడు వారి దర్శనం చేయిస్తాను. అప్పుడు జవానుకి మాత్రం వొక రూపాయి తప్పదు సుమా!'

''అదోటా''

''మరి తప్పదు. అంతా వాడితోనే వుంది''

''అయితే, ఇక తల వొక్కటీ మిగిలి వుంది, ఆ రూపాయకోసమూ అది తాకట్టు పెడతాను''.

''ఏదో సర్దుబాటు చేసుకోవాలి మరి''

''ఏ పూట కాపూట అవస్థ పడేవాళ్ళం, మేమేమి ఇవ్వగలం మహానుభావా?''

''నాకో కాగితం ఇచ్చినందుకూ, జవానుకో రూపాయ ఇవ్వబోతున్నందుకూ పూచీ అంతా మాదే అనుకోవద్దూ. సుమా!''

''ఎంతమాట? మరి యీ ఉత్తరం–''

''ఉత్తరం?''

''ఏం, అలా పెదవి విరుస్తారేం?''

'ఉలిక్కిపడవద్దు. ఉన్న సంగతి చెబుతున్నాను. అబద్ధాలు చెప్పడమూ, మొగం యెదట పొగడడమూ, దగా చెయ్యడమూ నా చేత కాదు. నువ్విన్ని విధాల ప్రాధేయపడుతున్నావు కనుక, నా మనస్సు వెన్నలాగ కరిగిపోతోంది – కరిగిపోయింది కూడానూ''.

''చిత్తం''

''ఈ పరిస్థితుల్లో నా వల్ల నీకు జరిగే ఉపకారం వారితో సావకాశంగా మనవి చేసుకోవడానికి వీలు చిక్కడమే. పనంతా ఆ ఉత్తరం వల్లనే కావాలి. కాని–''

''... నిజం చెప్పండి''

''అదే చెబుతున్నాను. ప్రెసిడెంటు గారికి సబ్ కలెక్టరంటే ఇష్టం లేదు''

''చచ్చాను. ఏం?''

''ఏమయితే యేం? అది అలాగా''

''అయ్యో!''

''ఆ ఉత్తరం నాలుక గీసుకోడానికైనా పనికిరాదు''

''కొంపగుల్ల–''

''అగ్గదీ, అగ్గదీ రంగు తెలుతోంది అక్కడ యే మాత్రం''

''రామరామా! బ్రామ్మణ పక్షపాతులండీ కలెక్టరు దొర వారు. వెళ్ళి ఆశ్రయించాను. అనుగ్రహించారు''

''అలాగేం? అబ్బా!.... సరే, యేం జరిగిందో జరిగింది కుంభకోణం. అదంతా నాకెందుక్కానీ – చెప్పాను కాదూ? ఆ ఉత్తరానికి తెల్లకాగితానికీ వొక్కటే విలువ''.

''మరి గతేమిటీ?''

''అపాయం లేని ఉపాయం, దివ్యమైన దొకటుంది. కావలిస్తే చెబుతాను''

''సెలవ్వండి''

''ఆ ఉపాయం అవలంబించారంటే మీరు వారిని చూడనే అక్కర్లేదు, తెల్లవారేటప్పటికి ఆర్డరు మీ చేతిలో పడుతుంది''

''అనుగ్రహించమన్నాను కాదూ?''

''చెబుతామనే కాదూ ఈ ప్రయత్నం? అయితే, పని అయ్యేక మాత్రం నాకింకో కాగితం – తెలిసిందా?''

''ఇంకానా?''

''... బాగుంది. అయితే రేపుదయం రావయ్యా, ప్రెసిడెంటు గారి దర్శనం చేయిస్తాను. మీ డబ్బు తిన్నాను కనక ద్రోహం చెయ్యను''

''ధర్మమా?''

''పోనీ, కష్టంగా వుంటే మీ కాగితం మీరు పట్టుకు పొండి...''

'ఉపాయం చెప్పండి''

''చెప్పనూ? మరి ముందు నువ్వు 'ఊ' అనాలి''

''ఎక్కడ తేనూ?''

''మళ్ళీ మొదలా? ఎక్కడ తేవాలో, ఎలా తేవాలో నేను చెప్పాలా? సరే కాసుకో, మణుగునెయ్యూ–''

''... ... ...''

''ఏం, తెల్లపోతావేం?''

''తమరేమిటో సెలవిస్తున్నారు. నా తల విలువ తెలుసుకుని తమరేమన్నా–''

''నీ తల విలువ అవే చెబుతుంది''

''... ... ''

''నాలుక కరుచుకుంటావేం?''

''... ...''

''మాట్లాడ వేమయ్యా?''

''... .. ''

''నా దగ్గిరా వేషాలే?''

''ఆ ఉపాయం చెప్పండి''

''అలా దారికి రా. తప్పకుండా ఇస్తావు కాదూ?''

''ఇచ్చుకుంటాను''

''లేకపోతే, మళ్ళీ తెల్లవారాటప్పటికి ఆర్డరు రద్దయి పోతుంది సుమా!''

''వద్దు, వద్దు, చెప్పండి''

''అయితే, ఏదీ మీ గాయిత్రి..''

''... .. ...''

''ఆ! చాలు, మరి విను. బాగా జ్ఞాపకం వుంచుకో''

''చిత్తం''

''మెరకవీధి – దుగ్గిరాల శేషాచలం – ఎప్పుడయినా విన్నావా?''

''లేదు, ఎవరండీ ఆయన?''

''ఆయన కాదు, ఆవిడ. వేశ్య!''

''... ..''

''ఏం మైలపడ్డావా? సచేలస్నానం చెయ్యాలా?''

''ఏమయితేం, సెలవివ్వండి''

''అది చాలా అందకత్తె, బంగారబొమ్మ, మాంచి ముమ్మరంలో వుంది. చూస్తే విడిచిపెట్టడం కష్టం. అప్పుడే నలుగురైదుగురు పకీరు లయిపోయారు''

''వర్ణన అక్కర్లేదు. చెప్పండి''

''అది శిఫారసు చేస్తే –''

''శిఫారసా?''

''అవును. అంటే, సరసానికి వొప్పుకుంటే అన్నమాట''

''... .. ..''

''మరి నీ తెలివితేటలూ, నీ పాండిత్యమూ ఇందులో తెలుస్తాయి''

''వేదం చెప్పుకున్నవాణ్ణి?...''

''మరి నీ కొడుక్కి కూడా ఆ వేదమే చెప్పుకుంటే ఈ తిప్పలు లేకపోవును కాదూ?''

''... ...''

''వేదాలు శాస్త్రాలూ మీకే వుండాలి. ఉద్యోగాలు కూడా మీరే కొట్టెయ్యాలి. అవునా?''

''.... ... .''

''మీ పూర్వులు మాకు సర్వనాశనం పెట్టినా చివరికి దాస్యం అయినా విధించారు. మీరు బయలుదేరి అది కూడా లేకుండా చేస్తున్నారు. కాదూ–''

''..... ... ఇక యీ ఉత్తరం''

''ఆముదం అన్నమాట. అందులోనూ వొకటో నెంబరు అంబాజీపేట సరుకు. పేగులు మహాబాగా శుద్ధి చేసేస్తుంది. చేసేసింది కూడానూ''

''పుండుమీద కారం చల్లుతున్నారు మీరు''

''చీము పట్టకుండా తొరగా మానిపోతుంది – నయమే కాదుటయ్యా?''

'' ... .''

''వెళ్ళవయ్యా బ్రాహ్మడా! తెల్లబోయి నుంచుంటే అవుతాయిటయ్యా ఈ రోజుల్లో పనులు?''

''ఆ పని చెయ్యక తప్పదంటారా?''

''తప్పకేం? నిర్బంధమా ఏమిటి? మానెయ్యడమే నా సలహా. అదే బహూ వుత్తమమైన పని. కాని దానికి ముందు. ఉద్యోగవాంఛ వుందే? దానమ్మ కడుపు కాల, అది చేస్తోంది ఇదంతాను. కనుక దాన్ని వదిలించుకో గలిగితివా – ఇక వేశ్యాదర్శనమే కాదు, దేవతాదర్శనం కూడా అక్కర్లేదు. నిశ్చింతగా కూచుని జంధ్యాలు మెలిపెట్టుకుంటూ వేదాలూ, వేదాంగాలూ – బోలెడ పనుంది మరి దయచెయ్యం డీపాటికి''

''... శివశివా''

***

''ఎవరు మీరు?''

''మేం బ్రాహ్మలం?''

''దండాలు. అలా దయచెయ్యండి''

''శ్రీకృష్ణార్పణం...''

''ఏం పనిమీద దయచేశారూ?''

''పెద్ద పనిమీదే వచ్చాను''

''మేళం కావాలా, కచేరీ చెయ్యాలా?''

''నాకంత తాహతూ లేదు, ప్రస్తుతం అవసరమూ లేదు. నేను వేదం వల్లించాను. ఆ విద్యల్లో, ఈ జిల్లాలో నా అంతటి వాడు మరిలేడు; కాని బహుకుటుంబీకుణ్ణి. పైగా రెక్కలే ఆధారం. అన్నం పెడతావని వచ్చాను''.

''ఏ వూరు తమదీ?''

''అసలు దుప్పలపూడి కాని; నాలుగేళ్ళ నుంచి ఈ వూళ్ళోనో ఉన్నాము''.

''... వస్తాను. దయచెయ్యండి''

''.... ''

''... తమ వంటివారిని సత్కరించడానికి శక్తిలేదు. యోగ్యతా కూడా లేదు. అయినా 'పత్రం పుష్పం ఫలం తోయం – శ్రీకృష్ణుల వారు సెలవిచ్చారు కాదూ?... స్వీకరించి... దీవించండి''.

''సకల సౌభాగ్యాలూ వున్నదానవు – నిన్నేమని దీవించనూ? కాక, పది రూపాయలు చేతిలో పెట్టే శక్తి లేదనీ, యోగ్యత చాలదనీ–''

''ఒక్క నెలగ్రాసమయినా ఇవ్వలేకపోయాను. సిగ్గుగా వుంది. అయితే ఇది వార్షికంగా భావించి, ఏటా వొక మాటు, ఇలాగే వుదయం పూజ చేసుకుని ఇవతలికి వచ్చే టప్పటికి దర్శనం దయ చేయిస్తూ వుండండి''.

''అమ్మా, ఆనందపారవశ్యం కలుగుతోంది. మాటలు రావడం లేదు. నీ యోగ్యత విన్నాను. విన్నంతా నిదర్శనం కనపడుతోంది. చాలా సంతోషం. అయితే, నువ్వొక్క సంగతి ఆలోచించాలి. నేను నీ దగ్గరికి డబ్బుకోసం రాలేదు. కనక ముందు ఈ రూపాయిలు నీ దగ్గిర వుంచు..''

''... తమ దగ్గిరే వుంచి తమరే వినియోగించండి. ఇచ్చేసింది మరి నేను పుచ్చుకోను. ఇక నా వల్ల తీరవలసిన ప్రయోజనం ఏమిటో సెలవిప్పించండి..''

''చెప్పమంటావా?''

''సందేహం ఎందుకూ?''

''లేదు, చాలా ఆశపడి వచ్చాను''.

''కానివ్వండి, చెయ్యతగిందీ, చెయ్యగలిగిందీ అయితే నేను కాదనను''

''అనుగ్రహం వచ్చిందంటే నువ్వు మమ్మల్ని ఎల్లకాలమూ పోషించేస్తావు. అంచేతే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను''

''సరే''

''వేశ్యావాటికలో అడుగుపెట్టడానికి నాకిదే మొదలు. సగం చచ్చి వచ్చాను; కాని నీ యోగ్యత చూడగా సిగ్గుపడవలసిన అవశక్యం ఎంత మాత్రమూ కనబడదు''

''తమ కోరిక సెలవిప్పించండి''

''చేస్తానని నువ్వు ముందు వాగ్దానం చేస్తేగాని నేను చెప్పలేను''.

"అలాగ నేనెప్పుడూ వాగ్దానం చెయ్యను. వేశ్యల ద్వారా నెరవేరే రాచకార్యాలేమీ వుండవు. ఉన్నా మనవి చేశాను కాదూ? ఆ పనేమిటో ముందు తెలవాలి''.

"... అలా అన్నావా?.... అయితే విను. నాకు ఆరుగురు కూతుళ్ళు. ముగ్గురు కాపరాలు చేసుకుంటున్నారు. ముగ్గురూ బిడ్డల తల్లులు. పెద్ద కూతురు మనుమలనే ఎత్తింది. ఇంకా యిద్దరు ఆడపిల్లలకి పెళ్ళిళ్లు చెయ్యాలి. ప్రస్తుతం నాలుగో అమ్మాయికి కార్యం చెయ్యాలి. ఇదిలా ఉండగా; నాకొక్కడే కొడుకు. ఆ కొడుక్కి మూడు మాసాల కూతురు-''

"తమ కుటుంబం. పొద్దుటిపూట లేవగానే చూసేవాళ్ళ పాపాలు పోగొడుతుందండీ!''

"నీకలా తోచడం నా అదృష్టమే. మరి ప్రకృతం, కొడుకుని కష్టపడి యె.ఫ్పే చదివించాను. అదేదీ అదీ?.... యల్టీ - అది కూడా అయిపోయింది. ఉద్యోగం - అంటే యిపుడు మేష్టరీకోసం తిప్పలు పడుతున్నాను''

"... అలాగా?''

"అది నువ్వు శిఫారసు చేస్తే-''

"నేనా?''

"అవును తల్లీ! అలాగే తెలిసిందమ్మా! ఈ పుణ్యం కట్టుకోవూ?''

"ఇదేదో అగ్నిహోత్రవ్వుంతలా కనపడుతోంది. ఇదేదో కుట్రగా తోస్తోంది. అయినా అది యిచ్చేవారెవరూ?''

"జిల్లా బోర్డు-''

"ఆ!''

"ప్రెసిడెంటుగారుట!''

"... ... ...''

"ఏం తల్లీ? ఏం మామ్మా? ఏమిటో వాణికిపోతున్నట్టు కనపడుతున్నా వేమిటమ్మా? ముచ్చెమటలూ పోస్తున్నట్టున్నూ కనపడుతోందేం తల్లీ?''

"మాట్లాడవేం మామ్మా?''

"అదంతా తరువాత చూసుకుందాం. బాబయ్యా, నేను శిఫారసు చేస్తే యిస్తారని యెవరు చెప్పారు?''

"ఎప్పుడూ వారి దగ్గిర వుండే గుమస్తా''

"శ్రీహరి... శ్రీహరీ''

"అదేనమ్మా?''

"... ...''

"నీ వాలకం చూస్తే నాకేమో దిగులు పుడుతోంది. చెప్పవేమిటమ్మా?''

"తమరేమీ భయపడవద్దు. నా కివాళ కఠినపరీక్ష కామోను! లేకపోతే ఇది ఇలా సంభవించదు. అయితే, బక్క పలచగా - విషపు చూపులు - నంగి నంగి మాటలూ - ఆ ఛండాలు డేనా తమకీ సంగతి చెప్పింది?''

"అవును, ఆ బోసినోటి పులే''

"... దేవుడున్నాడా అవధానులు గారూ?''

"అదేం తల్లీ?''

"అదేమంటే? దేవుడు లేదు, దెయ్యాలు మాత్రం వున్నాయి. ధర్మం లేదు. అధర్మం అంతటా నిండిపోయి వుంది. మంచి మందులోకయినా లేదు. దౌర్జన్యం మాత్రం పెరిగిపోతోంది. నీతి మాలోనే కాదు. మన దేశంలోనే లేదు. ఎవరేం చెప్పినా శుద్ధ అబద్ధం తప్ప సత్యం లేనే లేదు. ఎటు చూసినా హింస. ఎక్కడ పట్టినా రక్తం. దేవుడు లేనేలేడండీ!''

"దేవుడి విషయమై ఇంతగా అపనమ్మకం కలిగించే సంఘటన నీకేమి సంభవించింది తల్లీ?''

"కోప్పడవద్దు. నన్ను నిందించనూ వద్దు. బ్రాహ్మల్లో కటిక ఛండాలురున్నారంటారా లేరంటారా?''

"లే-ర-ని-చె-ప్ప-లే-ను''

"అయితే ఆ ఛండాలురకు తమరు చెప్పిన ప్రెసిడెంటు మొనగాడు, కుల పెద్ద''.

"... ''

"ఏం, కష్టంగా వుందా తమకి?''

"లేదు లేదు; కాని పాకీవాళ్ళ స్వాధీనంలో కూడా కొన్ని పనులున్నాయి''

"నిజమే కాని; పాకీ వాళ్ళని ఏమీ అనకూడదు.

విలువలకు పీటవేసే శ్రీపాద కథలు

శ్రీపాద కథలంటే ఇష్టం. మానవ సంబంధాలు సంస్కార పరిమళభరితంగా వుంటాయి ఆయన కథలలో. దిగువ మధ్యతరగతి సంప్రదాయ కుటుంబాల్లో వుండే విలువల్ని ప్రతిబింబిస్తాయి.

-డాక్టర్ ఎన్. గోపి

సెల్:93910 28496

ఏమంటే? పాకీ పని వాళ్ళకి వృత్తి, వృత్తికీ ప్రవృత్తికీ సంబంధం ఏమిటి?''

"నిజానికేమీ లేదు''

"కనక, పాకీవాడు పాకీపని చెయ్యాలి. లేకపోతే అంత కంటే ఎక్కువ యోగ్యత కనపరచాలి''

"అవును''.

"మరి బ్రాహ్మడు?''

"దైవికాంశ కనపరచాలి''

"మన ప్రెసిడెంటు దగ్గిర ఆ దైవికాంశ దాకా ఎందుకూ - మానవాంశ కూడా లేదు సరికదా, రాక్షసుల అంశ మాత్రం పూర్తిగా వుంది''.

"కొన్ని అవగుణాలున్నాయని విన్నాను. పరమ దుర్మార్గుడని తెలవదు''

"దుర్మార్గుడే కాదు పశువు... పశువుకంటే అధముడు''.

"నీ కేమీ అపకారం చేశాడు తల్లీ, ఆయన?''

"నాకేమీ చెయ్యలేదు అపకారం; తన ఆటవికత మాత్రం బయట పెట్టుకున్నాడు''

"అంటే?''

"నాట్య సంప్రదాయాలను కోయవాళ్ళు కూడా శిరసావహిస్తారు. మన ప్రెసిడెంటు ఆమాత్రమూ కాలేకపోయాడు''

"బోధ పడలేదు''

"నేనొక బ్రాహ్మణ ఇంట్లో పెళ్ళికి మేళం వెళ్ళాను

"సరే''

"మొగపెళ్ళివారికి మన ప్రెసిడెంటు చుట్టం?''

"పెళ్ళికి వచ్చారన్నమాట''

"అవును... ఒక రాత్రి బసకి రమ్మని నాకు కబురు. తమకి నా సంగతి చెప్పిన ఆ వూరకుక్కే రాయబారి''

"తెలవక అడుగుతున్నాను. అమ్మా! నీకూ ఆయనకీ యిదివరకి సంబంధం లేదూ?''

"లేదు, కబుర్లు వచ్చాయి. నే నంగీకరించలేదు''.

"అ-లా-గా?''

"మా పింతల్లి కూతురికీ ఆయనకీ సంబంధం వుంది. దానికీ నాకూ వున్న అనుబంధం పురస్కరించుకుని నేను వల్లకాదన్నాను. ఒకమాటు ఈ సంగతి దానితో చెప్పగా, దీనిమీద వాళ్ళిద్దరూ తగవులాడుకున్నారు. మరో రెండు నెల్లకి వాళ్ళకి చెడిపోయింది''.

"చాలా గొడవ వుందే?''

"నేనెప్పుడూ, ఎక్కడా, ఎవరి బసకీ వెళ్ళను. పైగా మేళం వెళ్ళినచోట బ్రహ్మచర్యం ఆచరిస్తాను... వల్ల కాదని కచ్చితంగా చెప్పేశాను''.

"మంచి పని చేశావు తల్లీ!''

"నూరు రూపాయల కాగితం మీద పడేశాడు. పుల్లాకు చూచినట్టు చూసి నేను దూరంగా వెళ్ళిపోయాను''

"అగ్రజాతుల్లో పుట్టవలసినదానవమ్మా నువ్వు''.

"అదేమన్నమాట బాబయ్యా? ఇప్పుడగ్రజాతుల విశేషం ఏమిటి? అగ్రజాతుల్లో మాత్రం స్త్రీలకి ఆదర గౌరవాలున్నాయా? అగ్రజాతుల్లో కూడా స్త్రీ అంటే బానిసే కాదూ? ఆటబొమ్మే కాదూ?''

"... ... ...''

"ఏం. కష్టంగా వుందా బాబయ్యా? అయితే, నేనన్న మాట మరిచిపొండి. కరుణించి నన్ను క్షమించండి..''

"అక్కర్లేదు తల్లీ. అక్కర్లేదమ్మా! నువ్వు లోకవృత్తం చెప్పావు. కనుక క్షమించనక్కర్లేదు... అయితే, తరువాత ఏం జరిగిందీ?''

"ఆ వూరకుక్కగాడేం చెప్పాడో, మతిపోయిందో, అసలంతేనో, మన్నాడు సాయంత్రం సభలో నేను గజ్జె కట్టి వుండగా విప్పించి సత్రకాయచేత కట్టించాడు. రాత్రి వూరేగింపులో నన్ను కట్టమన్నాడు.''

"నీ మీద పగపట్టాడన్నమాట''

"పశుత్వం కాని, ఇది పగా బాబయ్యా? సభలో నాయకురాలిని గజ్జె విప్పించినవాడూ, వూరేగింపులో నాయకురాలిని గజ్జె కట్టమన్నవాడూ మనిషేనా?''

"ఇప్పటి వాళ్ళకి మన విద్యలూ, మన సంప్రదాయాలూ, మన మర్యాదలూ, ఏం తెలుసును తల్లీ?''

"విద్యలు అక్కర్లేదు కాని, ఆ విద్యలు నేర్చిన స్త్రీలు కావాలి. అంచేత పశువులనడం... అదలా వుండనివ్వండి... తరవాత వాకబు చేసాను. మన ప్రెసిడెంటుకి రూకతృష్ణ తప్ప మరేమీ లేదు. ఈ కుట్ర అంతా ఆ వూరకుక్కది''

"మెహర్బానీకోసమా?''

"కీలు బొమ్మను చేసి చాటునా మాటునా గడ్డి కరవడానికి''

"... ... ...''

"ఎంత కల్పనో ఇప్పుడు బోధపడిందా? సాధారణంగా మేము డబ్బు తెచ్చినవాడినల్లా చేరనిస్తాము. అయితే, వాళ్ళలో రసికులు కాదగ్గవాళ్ళు నూటికొకడో ఇద్దరో వుంటారు. తతిమ్మా అంతా-''

"బ్రాహ్మడు, పెద్దింటివాడు, మన ప్రెసిడెంటే ఇలా అయినప్పుడిక తక్కిన వాళ్ళ మాటెందుకూ?''

"నేను సిఫారసు చెయ్యడం అంటే ఏమిటో తమకిప్పుడు బోధపడిందా?''

"తెలిసిందమ్మా!''

"నే నంగీకరిస్తాననుకోండి. అయితే, అబ్బాయిగారికి ఉద్యోగం ఇవ్వడం నిరుకా?''

"అలాగే చెప్పాడు గుమస్తా''

"అంటే నా ఆత్మద్రోహమూ, మన ప్రెసిడెంటు పశుత్వమూ కలిస్తే నొక బ్రాహ్మణ కుటుంబానికి భుక్తి ఏర్పరుస్తాయన్నమాట - కదుటండీ?''

"... ... ...''

"కనక బాబయ్యా, ఈ రాత్రి ప్రెసిడెంటుని తీసుకు రమ్మని ఆ వూరకుక్కతో చెప్పండి''

"అమ్మా-''

"ఒక్క దమ్మిడీ అయినా పుచ్చుకోదనిన్నీ చెప్పండి''

"అమ్మా-''

"కూచోండి బాబయ్యా, అప్పుడే లేస్తారేం?''

"ఏమీ లేదు. నేను వచ్చిన దారినే వెళ్ళిపోతాను. నువ్వు ఆత్మద్రోహానికి సిద్ధపడవద్దు''.

"అదేమీ?''

"ఇంత కుట్ర? ఇంత ద్రోహమా? తనేలాగా తార్పుడుకాడే. నన్ను కూడా తనలాగ తయారు చేస్తాడా ఈ నీచుడు? నీకూ ప్రెసిడెంటుకి ఇది వరకే సంబంధం వుందని ప్రాధేయపడితే నువ్వు సిఫారసు చేసి పని యిప్పిస్తావనీ వచ్చాను. పైగా, నువ్వింత యోగ్యురాలవని ఎరగనే ఎరగను. నేను బ్రాహ్మణ్ణి. వేదం వల్లించాను. యాచన చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాను. ఇకముందు మరో నలుగుర్ని ఆశ్రయిస్తూ వుంటాను కాని, వేశ్య అయినా కులాంగనలాగ అభిజాత్యం కల వొక కళావతిని తార్చడానికి - స్వార్థం కోసం వొక భీతహరిణాన్ని పులివాత కంచ చెయ్యడానికి నేను సాహసించలేను. కనక తల్లీ, నన్ను క్షమించు. నా కోరిక మరిచిపో, నాకు సెలవియ్యి''.

"వల్లకాదు, బాబయ్యా! తమరు వెళ్ళడానికి వల్లకాదు. నా మూలంగా వొక వేదమూర్తి కుటుంబానికి జీవనాధారం ఏర్పడడం నా అదృష్టం. నా జీవితంలో ఇదెంతో పవిత్రమైన సంఘటన. ఇలాంటిది మళ్ళీ లభించదు. ఇంతకీ నేను పతివ్రత నెలాగా కాను. మగనాలి నంతకంటే గాను. కనక దీనివల్ల నాకిప్పుడు కొత్తగా సంభవించే పాతివ్రత్యం కూడా ఏమీ లేదు. నాకు విచారం లేదు. తమరూ విచారించవద్దు''.

"తల్లీ-''

"ఇక నేను వినను. తమరేమీ సెలవివ్వద్దు. ఇది ఇలా

జరిగి తీరవలసిందే. మనవి చేసుకున్నాను కాదూ? పశువులతో సాహచర్యం మాకు పరిపాటే. బాబయ్యా. తమరు బెంగ పెట్టుకోవద్దు. ఇందాకా నేను చెప్పినమాట ఆ వూర కుక్కతో చెప్పండి''.

''నన్ను -''

''మరేమీ చెప్పనివ్వను. మరోలాగ చేశారంటే, నేర్చిన వేదానికి తమరు ద్రోహం చేసినవారవుతారు''.

''నా కంఠాని కురి బిగించావమ్మా!''

''తమరలా సెలవివ్వవద్దు. ఇక దయచెయ్యండి. ఎప్పుడేనా దర్శనం దయచేయిస్తూ వుండండి. అమ్మగారికి నా దండాలు మనవి చెయ్యండి''.

''అమ్మా! నోరు కుట్టేశావు. కాళ్ళూ చేతులూ కట్టేశావు. నన్ను జీవచ్ఛవాన్ని చేసి-''

''అంతమాట అనవద్దు బాబయ్యా!''

''ఏం సత్తా తల్లీ, నీది? ఎంత యోగ్యురాలవమ్మా నువ్వు? ఏం జన్మ కన్నా నీది. వేశ్యాకులంలో నువ్వు తప్పపుట్టావమ్మా''.

''ఏం, వేశ్యాకులం అంత చెడిపోయిందా బాబయ్యా? అగ్రజాతి గృహిణులందరూ మచ్చలేనివారేనా నాయన గారూ? మాలో నన్ను తల తన్నే ఇల్లాళ్ళు - సానులయి వుండీన్నీ పాతివ్రత్యానికి వరవడి పెట్టేవారు వేలున్నారు. కాని లోకం గుడ్డిది, పురుషులు మత్తులు... ఇప్పుడిదంతా అప్రస్తుత ప్రశంస. దయచెయ్యండి ఒక్కమాటు పాదాలు...''

''శ్రీకృష్ణార్పణం... ఎన్నితిప్పలు పెట్టాడూ నాకూ? దేవుడు లేడూ? గాయత్రీదేవి ఇదంతా చూడ్డంలేదూ? ఈ ద్రోహి - ఈ అప్రాచ్యుడు ముందుకి వస్తాడా?....''

***

''... పద్హారు, పద్హేడు, పద్దెనిమిది, పందొమ్మిది. ఇర్వయ్''.

''ఏం... రెండు వందలూ ఉన్నాయా?''

''... ఉన్నాయి కాని, కడిగేసినట్టు వొట్టి రూపాయలా తేవడం?''

''.. .. ...''

''మర్యాదలు తెలవ్వండీ మీ బ్రాహ్మలికి, బజారంతా బత్తాయి పళ్ళలా దొర్లిపోతున్నాయికదా, వొక్కవంద పట్టించుకువస్తేం?... పోనీ, నాలుగు చక్రకేళీ గెలలు, వొక్కడజను ఆపిలి పళ్ళు, నాలుగుశేర్లు ద్రాక్షపళ్ళు-''

''తోచింది కాదు. ఆగ్రహపడకండి. మొదటి నెల జీతం-''

''సంవత్సరాని కారువందలండీ. మొదటి నెల జీతం-''

''ఇంకెందుకూ, తెస్తానన్నానూ కాదూ?''

''అయితే, యింకోటి కూడా మరచిపోకండి''

''ఇంకా యేమిటి?''

''ఒక్క పరికిణీగుడ్డ. నాలుగ్గజాలయితే చాలు. గజం రెండూ రెండు బావులా - రొక్కం నా చేతిలో పడేస్తరూ నేను తంటాలు పడతానూ''.

''... ...''

''నా కొక్క కూతురండీ. లేక లేక నలుగురు కొడుకుల వెనక పుట్టిందండీ! మొన్ననే తొమ్మిదేళ్ళు నిండాయండీ! మా అత్తగారి పేరు పెట్టుకున్నా మండీ? వెన్నప్పంలా పెంచుకుందాన్నామండీ! అందటే నాకు ప్రాణమండీ!''

''తెస్తాలెండి''

''రైటో! అదీ మాట. అదీ దర్జా. ఇక వెళ్ళండి. తెల్లవారేటప్పటికి మా ఇంటికి రండి''.

''అలాగే ... అయితే, రెండు సంవత్సరాలకీ నొక్కమాటే ఆర్డరు పడిపోవాలి సుమండీ''.

''... నాలుకా తాటిపట్టా యిది. దీనికి తిరుగుందనుకున్నారుటండీ?''

''మరి సెలవు''

''సెలవు''

''... చూడండీ! 'మాలపల్లి', ఫిలింట, వెడదామా?''

''నేను బయలుదేరితే మా వాళ్ళూ కూఢా బయలుదేరతారు తెలుసా?''

''అంతట్లో యేం మునిగిపోయిందీ. జట్కా పంపిస్తాను బయలుదేర తియ్యండీ''

పెద్దగా వుందని వద్దనేశాడట!

రిచా గంగోపాధ్యా గుర్తుందా? అదేనండి లీడర్ ఫేమ్! 'మిరపకాయ్' తరువాత టాలీవుడ్‌నుంచి కోలీవుడ్‌కి వెళ్ళిపోయింది ఈ భామ! అక్కడికెళ్ళాక కొద్దిగా ఒళ్ళు చేసి బొద్దుగా తయారైంది. సరే...ఆవిడ బరువు సంగతి పక్కన పెడితే, ఇటీవల గౌతమ్ మీనన్ కొత్తగా తను చేయబోయే సినిమాలో రిచాను హీరోయిన్‌గా తీసుకున్నాడు. ఒకటి రెండు షెడ్యూల్స్ పూర్తి అయిన తరువాత ట్రయల్ చూసుకుంటే హీరో కన్నా హీరోయిన్ పెద్దగా అనిపించిందట! వెంటనే తన సినిమా నుంచి రిచాని తప్పించి వేరే హీరోయిన్ కోసం వెతుకులాట ప్రారంభించాడట గౌతమ్ మీనన్! అందరూ దర్శకుల కళ్ళకి రిచా ఈ విధంగా కనిపిస్తే ఇక ముసలి పాత్రలు తప్ప వయసు పాత్రలు రిచాకి దక్కక పోవచ్చని సినీ విశ్లేషకులు అంటున్నారు.

''సెబాస్! మాంచి తెగువకల బ్రాహ్మడవయ్యా! చూడండీ, జిల్లా బోర్డు మనకి స్వార్జితం అనుకోండి. ప్రెసిడెంటు బతుకు మన గుప్పిట్లో వుందనుకోండి. కనక, నన్ను మీరు మరచిపోకండి, మిమ్మల్ని నేనూ మరిచిపోను''.

''సంయే''

''ఈ రెండేళ్లూ అయిపోయాక మిమ్మల్ని వంద రూపాయల గ్రేడుకి లాగేస్తాను, చూసుకోండి''

''... గుడ్ బా-య్, గుడ్ బా-య్''

''... .. ..''

''... ప్రెసిడెంటుగారు-''

''వస్తున్నారా, రమ్మన్నారా.''

''వస్తారుట''

''తీసుకువచ్చి నువ్వవతలికిపో. ముందివిగో యీ.. అయిదు రూపాయలూ రోడ్డు కంట్రాక్టు బాపతు. ఈ రెండూ స్కూల్ మాష్టర్జీల బాపతు. పట్టుకుపో''

''థాంక్సు, థాంక్సు...''

''.. .. ..''

''... కంట్రాక్టర్లెవరేనా కనపడ్డారా?''

''లేదండి''

''దరఖాస్తుదార్లో?''

''లేదన్నమాటే''

''నుంచున్న పాళంగా డబ్బు కావాలే, మరెలాగా?''

''రేపయితే సప్లయి కావ... చ్... ఉ''

''రేపటిదాకా ఆగదు. అధమం నూరు రూపాయలయినా పట్టుక పెడితేగాని యివాళ అమ్మాణ్ణి గుమ్మం యెక్కనివ్వదు''.

''ఏం, మొగం ముడిచిందా?''

''నిన్న రాత్రి వుత్సాహం అంతా చచ్చిపోయింది''

''అదంతా యివాళ కూడ తీస్తాను. అమ్మాణ్ణి మాట మరిచిపోండి''

''మరిచిపోయి''.

''దానబ్బసాని దగ్గరికి వెడదాం యివాళ''.

''ఏమిటీ?''

''ఇవాళ మీ తపస్సు ఫలించింది''

''ఎవరోయ్?''

''చెబుతా కాదూ''

''రాజామణా?''

''చా''

''నీలం -'' ''ఛీ''

''వీరభద్రం-''

''ఛేస్''

''మరెవరోయ్''

''చూస్తారు కాదూ? భోజనం చేసి, యిక రెండుగంటల్లో - బయలు దేరడమే కాదూ?''

''భోజనమూ వద్దు వల్లకాడూ వద్దు? ఇప్పుడే-''

''... .....''

''ముక్కుమీద వేలు తీసెయ్, పిలూ డ్రైవర్ని''

''అలా కాదు. పోనీ, చెబుతా కూచోండి''

''తొరగా''

''శేషాచలం''

''దుగ్గిరాల-''

''అవునదే''

''వో - య్యేస్స్! గుమస్తా అంటే నువ్వేనోయ్! చక్రవర్తుల దగ్గిర ప్రయివేటు సెక్రటరీగా...''

''మాటలే కాదూ? వొట్టి షేక్‌హాండులే కాదూ?''

''ఇక అలా కాదు. విసిరికొట్టిన సానిని లొంగతీశావు నువ్వు. ఏం చేసినా నీ రుణం తీరదు. నీకేం కావాలో చెప్పు - ఈ క్షణంలో చేసేస్తాను''.

''అయితే, దీనిమీద సంతకం పెట్టండి''

''ఏమిటిదీ?... రోడ్డు మెటలింగు కంట్రాక్టా? ఏమయినా రాల్చు కున్నావా?''

''రామరామా! ఆయన మా అత్తవారి చుట్టమండీ!''

''వెంకటయ్య టెండరుకంటే యెక్కువ రేటుదే?''

''దిద్దించేస్తాలెండి''

''గప్‌చిప్! తొరగా అయిపోవాలి..''

''... దీనిమీద కూడా కాస్త బరికెయ్యండి''

''అదేమిటి?''

''హైస్కూల్లో కాళీ''

''రెండున్నాయి కదా? .... ఓహో, యాభై రూపాయలదా? ఇందులోనయినా యేమయినా-''

''పరమదరిద్రుడు. పైగా మా అత్తవారి పురోహితులవారి ఏకైక అల్లుడు. వద్దు వద్దంటూ వుంటే మా అమ్మాయికి దక్షిణాది పరికిణీ గుడ్డ-''

''ఛూ... పోనీ నాకేం?...''

''.. .. ..''

''ఇదేమిటి?''

''రెండు మాసాల కాళీ''

''పాతిక రూపాయలదా?''

''అవును''

''ఇందులోనయినా -''

''దీని విషయం సిఫారసు చెయ్యడానికే శేషాచలం''

''ఆ!''

''అవధానులుగారిని దానిమీదికి పుసికొల్పాను''.

''అసాధ్యుడే. దాని యెదటే ఆర్డరు వెయ్యకూడదు?''

''కులాసాగా కాలం గడుపుకోకుండా అంతఃపురంలో కూడా మీకీ పాడు వ్యవహారాలేమిటండీ?''

''సెబాస్! నీ వంటి హంగుదారు మరి లేడోయ్!''

''మీరు నన్ను కాస్త కనిపెడుతూ వుంటే నా జీవితం మీ కోసం దారపోసెయ్యనూ?''

''ఇకముందు నువ్వు సంతకం పెట్టమన్నచోట 'యేమి'టని అడక్కుండా - చూడకుండా సంతకం పెడతాను, సరా? వీలయినంతవరకూ బోర్డు సొమ్ము కూడా-''

''మీ పేరుగా వొక కొంప-''

''కొంపేమిటి మళ్ళీ. - 'మేడ' అను. దానికి పునాది వెయ్యడానికి ప్రధాన మంత్రిని లాక్కువస్తాను - చూసుకో''

''అయితే, ఇక నేను పోయి, అంతా సర్దుబాటుచేసి, కాస్త భోంచేసి వస్తాను. యెనిమిదన్నరకి సిద్ధంగా వుండండి''

''ఆల్‌రైట్ మైడియర్ ప్రీమియర్!''